చెలిమి - 26, మే 1999

# ఉద్యోగం

అప్పుడు రాత్రి పదకొండు గంటలయ్యింది. అయినా మహలక్ష్మి నిద్రపోలేదు. మంచంమీద కూర్చునే ఉంది. ఒకటి రెండుసార్లు పక్క మంచంమీద పడుకున్న భర్త రాజారావు వైపు చూసింది. ఆయన వంటిమీద కప్పిన దుప్పటి క్రిందకి వేళ్లాడుతూ ఉంటే మంచం దిగి వెళ్ళి దాన్ని ఆయన గుండెల వరకూ సరిజేసింది. తిరిగి పడుకునే ప్రయత్నంలో ఓ చేతిని తలక్రిందకు చేర్చుకుంది.

ఎంత వద్దనుకున్నా, మనసును ఎంత అదుపులో పెట్టుకున్నా ఏవేవో ఆలోచనలు నాకూ నిద్రకూ మధ్య అడ్డు తగులుతూనే ఉన్నాయి.

ఏడాదిగా భర్త రాజారావు పక్షవాతంతో మంచాన పడి చావు బ్రతుకుల మధ్య నిస్సహాయంగా అల్లాడిపోతూనే ఉన్నాడు. మంచాన పడ్డ భర్తకు సేవచేస్తూ, ఆయన సంపూర్ణంగా కోలుకునేందుకు దిగులుతో రోజుల్ని వెళ్లదీయడం మహలక్ష్మికి అలవాటుగా మారింది. ముప్ఫై సంవత్సరాల తమ అనుబంధాన్ని పాయలుగా చీలుస్తున్న విధి మీద ఆమెకు ఎన్నోమార్లు వెర్రికోపం వచ్చింది 'నీవే దిక్కు' అంటూ దేవుడికి పూజలూ ప్రార్థనలూ చేసిన నోటితో తిరిగి అదే శక్తి మీద విరుచుకు పడబోయి - వివేకం వెనక్కి లాగితే మౌనంగా ఉండిపోయింది... ఆమె రోజులో చాలాసేపు వేధించే జ్ఞాపకాల మధ్యనే నలిగిపోతోంది....

అప్పుడే తలుపు తెరుచుకుని కొడుకు సుధాకర్ లోపలికి వచ్చి తండ్రి మంచం దగ్గర కాసేపు నిలబడి ఆయన తలగడ సరిజేసి ఆపైన ఆయన వంటిమీద బట్టల్ని తడిమి చూశాడు. తల్లి మంచం దగ్గరకు వెళ్లి, "అమ్మా నువ్వింకా నిద్రపోలేదా?" అని అడిగాడు.

"పొడి కళ్లు పడ్డాయిరా. అంతే...."

"అమ్మా నువ్వు ఎక్కువసేపు మెలుకవగా ఉండొద్దు. నేను అలారం పెట్టాను. నువ్వు నిద్రపో... నేనో, లీలో ఎవరో ఒకరంలేచి నాన్నగారిని చూస్తాంలే.."

"ఫర్వాలేదు... నువ్వు వెళ్ళి పడుకోరా... నేను ఉన్నానుగా."

సుధాకర్ మాత్రం తల్లి మంచం దగ్గరకెళ్ళి, ఆమె పక్కన కూర్చుని చిన్న స్వరంతో "అమ్మా" అని పిలిచాడు.

"ఏమిటిరా?"

"అమ్మా నీ ఆరోగ్యం కూడా అంతంత మాత్రం... ఈ వయసులో సరియైన నిద్ర లేకపోతే నీకైనా కష్టమే కదా..."

"అవుననుకో... కానీ ఎలారా? పాపం – ఇంట్లో పన్లన్నీ లీలే చేస్తోంది. తనూ చిన్నది.... పైగా నాన్నగారి పన్లు కొన్ని నేనే చేయాల్సి ఉంటుంది."

"నాన్నగారు పక్షవాతంలో మంచాన పడి అటూ ఇటూగా ఏడాది అయ్యింది... నీ లీవులన్నీ అయిపోయాయి... పైగా అప్పులు పెరిగాయి... ఖర్చుల సంగతి అడగనే వద్దు. తల్చుకుంటే భయం వేస్తోంది..."

"అవునురా... ఏం చెయ్యాలి? మన అదృష్టం ఇలా వుంది..."

"అమ్మా... ఎలానూ లీల ఇంట్లో ఉంటుంది... నేను కూడా ఓ నెల ఎరన్డ్ లీవు పెడతాను.. నువ్వు ఫస్ట్‌కు డ్యూటీలో జాయిన్ అయిపో అమ్మా... నాన్నగారికి ఏమీ కాదు... నువ్వు ధైర్యంగా ఉండు..."

మహాలక్ష్మి ఏమీ మాట్లాడలేదు. సుధాకర్ తిరిగి అన్నాడు...

"నీ లీవు లెటర్ యివ్వడానికి నిన్న మీ బ్యాంక్‌కి వెళ్ళాను కదా. అప్పుడు డి.జి.ఎమ్ గారిని కలిశాను. ఆయన నీతో ఫోన్‌లో అన్ని విషయాలు మాట్లాడానని చెప్పారు. నాతో కూడా మరీ మరీ చెప్పారు. నువ్వు ఒక ఆర్నెల్లుసర్వీసు చేయగల్గితే చాలా లాభాలు ఉంటాయిట... ప్రమోషన్స్ అంటూ ఇస్తే ముందర అది నీకే వస్తుందట..."

"అవునురా... ప్రస్తుతం సీనియర్‌ని నేనే.... ఆర్నెల్ల తర్వాత రిజైన్ చేసినా, వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నా బెనిఫిట్స్ కొన్ని ఎక్కువస్తాయి. కానీ డబ్బుకోసం నాన్నను వదలడానికి మనసు ఒప్పడం లేదురా..."

"డాక్టరు కూడా చెప్పాడు కదమ్మా.... అంతా మన అదృష్టం మీద ఆధారపడి ఉంది. ఏం చేస్తాం?"

"మహాలక్ష్మి బాధపడుతూ "మీ నాన్న ఎంత ఆరోగ్యంగా ఉండేవారురా... ఇంట్లో ఎంత నిండుగా తిరిగేవారు... ఎవరికీ అపకారం చేయని మీ నాన్నకు ఇలాంటి జబ్బు రావడం ఏమిటి? ఇదంతా నా దురదృష్టం... అవును.. అవును..." అంది. ఆపైన భోరున ఏడ్చేసింది.

సుధాకర్ ఆ మసక వెలుతురులో తల్లి కన్నీటిని చూడలేకపోయినా ఆమె హృదయం లోంచి జివ్వుమని పొంగిన దు:ఖంతో తనూ కదిలిపోయాడు...

"ఊరుకో అమ్మా" అంటూ తల్లి వీపు రాశాడు. మహలక్ష్మి వెక్కుతూనే పమిట కొంగుతో కళ్లు తుడుచుకుంది. సరిగ్గా అప్పుడే లీల నెమ్మదిగా లోపలికి వచ్చి మంచంమీద క్రీనీడల్లా కూర్చున్న అత్తగారినీ, భర్తనీ చూసి "ఏమిటి ఇలా కూర్చున్నారు" అంది భయంగా. మహలక్ష్మి తేరుకుని "ఏం లేదు లీలా... మీ మామయ్యగారి వైద్యం గురించి, ఆరోగ్యం గురించి మాట్లాడుతున్నాం..." అంది.

సుధాకర్ మాత్రం లీలను చూసి, "అది కాదు లీలా... అమ్మ నీతో చెప్పలేకపోతోంది...." అంటూ అంతవరకూ తనకూ తల్లికీ మధ్య జరిగింది చెప్పాడు... అంతా విని, "ఇందులో పెద్ద సమస్యే ఏమందండీ... మీరూ బలేవారేనే" అని అత్తగారితో "మీ అబ్బాయి చెప్పింది కూడా బాగానే ఉంది అత్తయ్యా... ఇంటినీ మామయ్యగారినీ మేం ఇద్దరం కనిపెట్టుకు ఉంటాం... మీరు ఫస్టకు డ్యూటీలో చేరిపొండి... మీకూ కాస్త రిలీఫ్‌గా ఉంటుంది" అంది. "అవునమ్మా...." అన్నాడు ప్రాధేయపడుతూ సుధాకర్.

❖ ❖ ❖

మహలక్ష్మి ఏడాది తర్వాత తిరిగి డ్యూటీలో జేరింది. బ్యాంక్‌లో పనిచేసే పై అధికారులూ, క్రింద పనిచేసే వాళ్లూ ఆవిడకు హృదయ పూర్వకంగా స్వాగతం పలికారు. కొందరు మహలక్ష్మిని రాజారావుగారి ఆరోగ్యం గురించి అడిగి సానుభూతి అందించారు. ఆవిడ మామూలుగా తన టేబిల్ ముందు కూర్చుని పనిచేయడం మొదలు పెట్టినా – అంత త్వరగా ఆ వాతావరణంలో యిమడలేక పోయింది. మనసు ఇంటిదగ్గరా, మనిషి ఆఫీసులోనూ అయినట్టుగా అన్పిస్తే, ఒకటికి రెండుసార్లు ఇంటికి ఫోన్ చేసి లీలతో మాట్లాడింది. ఎన్నిసార్లు చేతినున్న వాచీ చూసుకున్నా అది తన సహజ ధోరణిలో పనిచేయనట్టే అన్పించింది. సాయంత్రం ఇంటికి రాగానే వెంటనే భర్త గదిలోకి వెళ్లి ఆయన యోగక్షేమాలు అడిగితేగాని ఆమెకు తృప్తి కలగలేదు... అలా అయిదు రోజులూ ఆఫీసుకు వెళ్లేముందు ఏ దూర తీరాలకో వెళ్లవలసినట్టే తనగది నుంచి డ్రాయింగ్ రూమ్‌కు, అక్కడి నుంచి వంటింట్లోకి అలంగం తిరిగేది! ఆవిడ వేసే వెనకడుగులు చూసి, సుధాకర్ లీలా ఆశ్చర్యపోతూ కూడా ఆటపట్టిస్తూనే ఉన్నారు. మాట మార్చి నవ్విస్తూ గుమ్మాలు దింపేవారు.

"అమ్మా ఈ రోజు లీల నీతోపాటు అమీర్‌పేట దాకా వస్తుంది. నాన్నగారికి మందులు కొనాలి. సరేనా?" అన్నాడు...

"నేను ఆఫీసు మాని వేయనులేరా... భయపడకు" అంది మహలక్ష్మి.

"అది కాదమ్మా నా ఉద్దేశం" అంటూ సుధాకర్ నవ్వేస్తూ బయటకు వెళ్లాడు. పావుగంట తర్వాత అత్తా, కోడళ్లు ఇద్దరూ బస్‌స్టాప్‌కు వెళ్లి, బస్ ఎక్కారు. లీల అమీర్‌పేట్‌లో బస్

దిగింది. మందుల షాపుకు వెళ్లి మామగారికి మందులూ, ఇంటికి కావాల్సిన సామాన్లు కొని తిరిగి బస్‌స్టాప్‌లోకి వెళ్లి నుంచుంది.

సరిగ్గా అప్పుడే లీల వెనుక నుంచున్న ఓ పాతికేళ్ల యువతి లీల భుజం మీద చెయ్యివేసి "లీలా" అని పిల్చింది ఎంతో ఆప్యాయంగా. లీల ఉలిక్కిపడి అలాగే వెనక్కి తిరిగి, ఆపైన ఆశ్చర్యంతో ఆనందంతో తన మొహం వెలిగించుకుని, "ఓ సుధా, నువ్వా" అంటూ ఆమె చేతిలో చేయి కలిపింది.

"ఇలా, ఎలా ప్రత్యక్షమయ్యావే" అంటూ ఓ పక్కగా తీసుకువెళ్లింది.

"అదే నా గొప్ప... నేనీ ఊరు ఎందుకు వచ్చానో చెప్పుకో చూద్దాం"

"మొగుడితో హనీమూన్‌కు వచ్చి వుంటావ్?"

"కాదు.."

"ఏ చుట్టాలింట్లోనో పెళ్లి ఉంటే – ఇలా తగలడి ఉంటావ్?"

"అదీ కాదు..."

"అయితే ఖచ్చితంగా నన్ను తినడానికే వచ్చావు... కరెక్టా?"

సుధ నవ్వుతూ అంది, "నే చెప్పేదంతా బాగా చెవి పెట్టి విను. సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బవకు. మనం ఇద్దరం ఏనాడో బి.ఎస్.ఆర్.బి. పరీక్షలు వ్రాశాం... అవి పాసయ్యాం.. తరువాత ఇంటర్వ్యూలకు వెళ్ళాం గుర్తుందా?"

"గుర్తే – అయితే.."

"అయితే ఏం లేదు.. నాకు పోస్టింగ్ ఆర్డర్స్ వచ్చాయి. నన్ను వరంగల్ కెనరాబ్యాంక్‌కు పోస్ట్ చేశారు... రేపే వెళ్లి జాయిన్ అవుతున్నాను..."

"కంగ్రాట్స్... కంగ్రాట్స్... అదృష్టవంతురాలివి, నువ్వు..."

"అది సరే... ఇది చెప్పు... నిన్నెక్కడికి పోస్ట్ చేశారు? డ్యూటీలో జాయిన్ అయ్యావా"

"నాకు కమ్యూనికేషన్ లేదు – ఇంకా."

"నేను బయలుదేరేముందు నీ గురించి అడిగితే అన్నయ్య నీ గురించి వాకబు చేశాడు. నీకూ పోస్టింగ్ ఆర్డర్స్ వెళ్లినట్టు చెప్పారుట... అయితే ఈ వేళో రేపో రావచ్చు.... తయారుగా వుండు. కంగ్రాట్యులేషన్స్ ముందే చెప్తున్నాను... అందుకో" అని ఓసారి అటూ ఇటూ చూసి 'పదవే ముందు కాస్త కాఫీ తాగుదాం' అంది. ఇద్దరూ దగ్గరలో ఉన్న హోటల్లోకి వెళ్లారు.

కాఫీ తాగుతూ సుధ, "మనం అదృష్టవంతులం లీలా... ఎందుకంటే మనకు మంచి మొగుళ్లు వచ్చారు... మంచి ఉద్యోగాలూ దొరికాయి... కాదంటావా?" అంది లీలకూడా నవ్వి, "నిజమే సుధా... కానీ నాకు కొన్ని ప్రోబ్లమ్స్ వచ్చాయే..." అంటూ ఇంటి పరిస్థితుల గురించీ, మామగారి గురించీ చెప్పింది.

సుధ అంతా విని, "అలానా? అయితే మీ అత్తగారో, మీ ఆయనో నిన్ను ఉద్యోగం

చేయవద్దంటే ఏం చేస్తావే? వచ్చిన ఆఫర్‌ని వదిలేస్తావా?" అంది.

లీల మాట్లాడలేదు.

"నువ్వు బాగా ఆలోచించు లీలా...ఎందుకంటే ఇప్పుడు ఉన్న పరిస్థితులు వేరు. రేపు ఇదే మనుషులు ఎలా మారుతారో, మన జీవితం ఏ మలుపులు తీసుకుంటుందో చెప్పలేం కదా?"

"అవును.."

"ఈ రోజుల్ని బట్టి - ఎవరైనా సరే ఆర్థికంగా నిలబడగల్గాలి. మంచితనం, సహృదయం, ఇంకా వేనవేల సుగుణాలు యివన్నీ కూడా డబ్బు ముందు తీసికట్టే అవుతున్నాయి.... జాగ్రత్త..." అంటూ తనకు తోచిన సలహాలు చెప్పింది. ఇద్దరూ హోటల్ నుంచి బయటకు వచ్చారు. లీల సుధని బస్ ఎక్కించింది. తనూ బయల్దేరింది. పదినిముషాల తర్వాత లీల తన ఇంటికి దగ్గరగా ఉన్న స్టాప్‌లో దిగింది. ఇంటివైపు నాలుగు అడుగులు వేసింది. వెనకే సైకిల్‌మీద వచ్చిన పోస్ట్‌మెన్ తనని చూసి ఆగడంతో ఆమెకూడా ఆగింది. చేతిలో అతను పెట్టిన కవరు ఆతృతతో చూసింది... తన గుండె హఠాత్తుగా కొత్త తరహాలో, సరికొత్త చప్పుళ్లు విన్పిస్తుంటే, మరోపక్క సంతోషం దానికి తోడవుతూంటే లీల కొన్ని నిముషాలు తట్టుకోలేకపోయింది. వెంటనే వాస్తవంలోకి వచ్చి కవరు చింపింది... గబ గబా మామగారి గదిలోకి వెళ్లి, ఆయనవైపు చూసి, దగ్గరగా వెళ్లి చెవి దగ్గర తన నోరుపెట్టి "నాకు బ్యాంక్ ఉద్యోగం వచ్చింది మామయ్యా" అంటూ రెండుసార్లు చెప్పింది. రాజారావుగారు కళ్లు పెద్దవి చేసి చూశాడు. అర్థం అయ్యిందో లేదోగాని చిన్నగా నవ్వాడు.. ఆమె తనతో తెచ్చిన గ్లూకోజ్ పేకెట్ విప్పి దాన్ని నీళ్లలో కలిపి నోసల్ ఫీడింగ్ ద్వారా తాగించింది.... ఆ తర్వాత ఫోనెత్తి అత్తగారికి ఫోన్ చేసింది, తిరిగి సుధాకర్‌కు ఫోన్‌చేసి, లోపలి నుంచే ఉప్పొంగే ఆనందాన్ని అదుపు చేసుకుంటూ 'శ:భవార్త' అంటూ మొదలు పెట్టి జరిగినదంతా చెప్పింది. అలాగే సుధకి ఫోన్‌చేసి జరిగిందంతా చెప్పింది.

సుధాకర్ ఆఫీసునుంచి వచ్చి అలవాటుగా తండ్రి గదిలోకి వెళ్లాడు. అప్పుడు డాక్టరు మంచం పక్క ఉన్న స్టూల్‌మీద కూర్చుని రాజారావుగారిని పరీక్ష చేస్తున్నాడు. సుధాకర్ డాక్టర్‌కి మౌనంగా విష్ చేశాడు. తండ్రి తలవైపు నుంచున్న లీలకూడా అతని కంటబడింది.

"బి.పి. నార్మల్‌గా ఉంది... మీరేం కంగారు పడకండి" అని డాక్టరు సుధాకర్‌తో చెప్పి, ఆ తర్వాత తన అరచేతిని మూసి దాన్ని ఊపుతూ "ఎలా వుంది మీకు రాజారావు గారూ" అని ప్రశ్నించాడు. రాజారావుగారు పేలవంగా నవ్వి కళ్ల ద్వారా కృతజ్ఞతలు అందజేశాడు.

"మందులు మామూలుగానే ఇస్తూ ఉండండి. నేను వస్తాను" అని డాక్టర్ లేచి బయటకు అడుగులు వేశాడు. సుధాకర్, లీలా ఆయన వెనకే వెళ్లారు. సుధాకర్ డాక్టర్‌తో

మాట్లాడుతూ గేటు వరకూ వెళ్లి ఆయన్ని పంపించి లోపలికి వచ్చాడు.

"కాఫీ తీసుకోండి" అని లీల, సుధాకర్‌కు కప్పు అందించింది...

"ఇంకా మా అమ్మ ఆఫీసునుంచి రాలేదు కదూ?'

"ఊహూ" అని లీల ఓ కుర్చీ లాక్కుని భర్త పక్కన కూర్చుంది.

"మరోసారి చెబుతున్నాను. అందుకో నా కంగ్రాట్యులేషన్స్" అన్నాడు సుధాకర్,

"థ్యాంక్స్" అంటూ లీల టేబిల్‌మీద ఉన్న కవరు తీసి సుధాకర్‌కి ఇచ్చింది. అతను ఎప్పాయింట్‌మెంట్ లెటర్ సాంతం చదివి, "జాయినింగ్ టైమ్ నెల వుంది... పోస్టింగ్ ఈ ఊళ్లోనే ఇచ్చారు. నువ్వు అదృష్టవంతురాలివి..." అన్నాడు.

"మీ అదృష్టమే నాకు ప్రాప్తించి ఉంటుంది." అంది లీల.

"బావుంది" అన్నాడు.

"ఏం బావుంది?"

"బావుందంటే, బావుందనే అర్థం.... చెప్పు...." అన్నాడు అదోలా సుధాకర్.

"ఏం చెప్పను?"

"నీకీ ఆర్డర్స్ యిప్పుడే రావాలా... ఓ ఆర్నెల్లు ఆగివస్తే ఎంత బావుండేది...."

"దేవుడు పరీక్ష పెడతాడంటారు. ఇదేనేమో"

"చూస్తే ఆయన పెద్ద పరీక్ష పెట్టింది నాకూ, మా అమ్మకూ"

"అదేమిటి.... ఆలోచిస్తే నిజానికి ఆయన పరీక్ష పెట్టింది నాకు అని నేననుకుంటు న్నాను కదా?" అంది నవ్వుతూ లీల. సుధాకర్‌కు అప్పుడు లీల నవ్వులో ఏ అందాలు, ఏ ఆకర్షణలు కన్పించలేదు. పైగా ఆ నవ్వు ఓ చిన్నపాటి తుపాకీ తూటాగా మారి తనని తాకినట్టుగా అన్పించి, అదోలా లీల వైపు చూశాడు.

"సరే... ఇప్పుడు నువ్వేం చేయాలనుకుంటున్నావ్? అది చెప్పు" అని, సుధాకర్ నెమ్మదిగా నేల చూపులు చూస్తూ ఉండిపోయాడు.

"మీరు చెప్పండి సలహా" అంది.

సుధాకర్ చిన్నగా తల గోక్కుని, జుట్టు పైకి తోసుకున్నాడు. ఆ పైన ఓసారి లీల మొహంలోకి చూశాడు అంతే!!

"నాకయితే ఈ ఉద్యోగంలో జేరాలని వుంది. నిజమే, మనం వారం నాడు వేసుకున్న ప్లాను తలక్రిందులవుతుంది. కానీ..."

"ప్లాను విషయం ఒక్కటే కాదు. నీ నిర్ణయం అమ్మ ఉద్యోగానికే ఎసరు పెడుతోంది.... అర్థమయిందనుకుంటాను, నీకు...."

లీల మాట్లాడలేదు.

"నీకు తెలుసు. అమ్మకు ప్రస్తుతం నెలకు పదిహేను వేలు వస్తోంది. ఇప్పుడు నువ్వు ఉద్యోగంలో జేరితే - నాన్న కాపలా కోసం అమ్మ తన ఉద్యోగం మానేసి ఇంట్లో

కూర్చోవాలి. మహావస్తే నీకు నెలకు నాలుగు వేలపై చిలుకు జీతం వస్తుంది. అవునా?... దాని మూలంగా మనం నెలకు పదివేల రూపాయలు నష్టపోతాం. నువ్వు ఎకనమిస్ట్‌గా ఆలోచించు, అప్పుడు నీకే అర్థమవుతుంది – నువ్వు ఏం చేస్తే బావుంటుందో...." అన్నాడు సుధాకర్. లీల చిన్నగా నవ్వి, "మీరు చెప్పింది కొంతవరకూ నిజమే... కానీ మీరన్నట్టు నేనూ ఎకనమిస్ట్‌గానే ఆలోచించాను.... లెఖ్ఖలు వేశాను... చెప్పనా?" అంది.

"ఎలా?"

"మీ అమ్మగారు ఆర్నెల్లు మాత్రమే ఉద్యోగం చేస్తారు. ఈ ఆర్నెల్లలో ఆవిడకు వచ్చే జీతం అంతా కలిపితే తొంభైవేలు అనుకుందాం. ఆ తర్వాత వచ్చేదీ, పెన్షన్ సంగతీ పక్కన పెట్టండి. కానీ నేను ఉద్యోగం లేకుండా ఇంట్లో కూర్చుంటే మనం ఏడాదికి సుమారు యాభైవేలు నష్టపోతాం... అదే ఉద్యోగం చేస్తే – ఈ బ్యాంక్ ఉద్యోగాన్ని అంటిపెట్టుకుని ఉంటే, రాబడి మొత్తం ఎంతో, ఆ లెఖ్ఖలూ మీరూ చేయగలరు. మీరు ఈ పార్శ్వం నుంచి ఆలోచించి చూడండి – కాస్త..." అంది లీల నెమ్మదిగా. సుధాకర్ లీలవైపు చూశాడు. అయినా జవాబు చెప్పడానికి అతను మాటలకోసం వెదుక్కోవలసి వచ్చింది. అందుకే కాసేపు ఆలోచించి, "ఏమో లీలా.... ప్రస్తుతం నువ్వీ ఉద్యోగానికి వెళ్లకుండా ఉండడమే మంచిదనిపిస్తోంది, నాకు... అమ్మ వాలంటరీ రిటైర్‌మెంట్ ఎలానూ తీసుకుంటుంది. అప్పుడు నేను నీకు ఉద్యోగం వేయిస్తాను. నేను మన ఇంటి పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని మాట్లాడుతున్నాను...." అన్నాడు.

లీల కాసేపు ఆలోచించి, "మనం కనుక సీరియస్‌గా ఆలోచిస్తే మరో దారి ఏదైనా దొరుకుతుందేమో, చూడరాదా?" అంది....

"ఆలోచించి ఆలోచించి నా బుర్ర ఇప్పటికే పగలిపోయింది..."

"పోనీ నేను చెప్పనా? ఏమీ అనుకోకూడదు, మరి..."

"చెప్పు"

"ఓ నెలా రెండు నెలలు మీరు ఈ.ఎల్. పెట్టండి, మామగారి కోసం ఓ అటెండెంట్‌ని పెడదాం. అప్పుడు మా ఇద్దరి ఉద్యోగాలకూ ఏ ఢోకా ఉండదు. బావుంది కదూ ఈ ప్లాను..." అంది లీల చిన్నగా.

సుధాకర్ క్షణం ఏమనాలో తెలియలేదు. బొమ్మలా లీలవైపు చూశాడు. "ఏమిటి ఆలోచిస్తున్నారు. అవసరం అయితే లీవు పెడతానని మీరేగా అన్నారు. అందుకే గుర్తు చేశాను...."

సుధాకర్ అసహనంగా అన్నాడు, "ఏమో... అమ్మ వస్తుందిగా.... ఆమెతో మాట్లాడు... చూద్దాం...."

"అత్తయ్యగారితో ముందు మీరు మాట్లాడితే బావుంటుంది."

"నాకు తెలుసు లీలా అమ్మా కూడా నాలాగనే ఆలోచిస్తుంది. ఒకవేళ అమ్మ నిన్ను

ఉద్యోగం చేయవద్దని సలహా యిచ్చిందనుకో... ఏం చేస్తావ్?"

సుధాకర్ సవాల్‌గా అడిగాడు.

"ఒకవేళ అత్తయ్యగారు నాకు గ్రీన్ సిగ్నల్ యిచ్చారనుకోండి. అప్పుడు మీరేం చేస్తారు? సంతోషంగా తల ఊపుతారా, అది చెప్పండి" అంది ప్రతి సవాల్‌గా లీల!

సుధాకర్‌కు ఏం మాట్లాడాలో తిరిగి తెలియలేదు. క్షణం లీలవైపు చూశాడు. అయినా అతను ఆలోచించడం మానలేదు. కూడికలు, గుణకారాలు చేస్తూనే ఉన్నాడు!!

❖ ❖ ❖

మహాలక్ష్మి పది నిముషాల పాటు సుధాకర్ చెప్పిందంతా వింది. వింటున్నంతసేపూ అతని వైపు చూస్తూనే ఉంది.

"లీల నా మాటలకు చిన్న బుచ్చుకుంది. నేను, కాని సలహా యిచ్చానా అమ్మా?"

మహాలక్ష్మి చిన్నగా నవ్వేసి ఊరుకుంది.

"ఈ స్థితిలో లీలకూడా ఉద్యోగం చేస్తే, చూసే వాళ్లకు కూడా అదోలా ఉండొచ్చు"

"ఎవరి వీలును బట్టి వాళ్లు చేసుకుంటార్రా..." అని ఆగి తిరిగి అంది ఆవిడ, "లీల తెలివైందిరా... కాంపిటీషనలో నెగ్గుకు రాగల్గింది. అందుకే మంచి ఉద్యోగం వచ్చింది. దాన్ని పోగొట్టుకోవాలంటే ఆమెకు బాధ అన్పించదేమిట్రా?"

"ఆమె బాధ పడుతుందనీ, నేనేదో అనుకుంటాననీ మాట్లాడొద్దు - అమ్మా మేమే కదా నిన్ను బలవంతాన ఉద్యోగానికి వెళ్లమన్నది. తీరా, ఇప్పుడు...."

"పోనీ నువ్వు శెలవు పెట్టరాదురా... ఏమవుతుంది?"

"నాకు కుదరదమ్మా"

"మీ యం.డి. ప్రకాశరావుగారితో నేను మాట్లాడతాను..."

సుధాకర్ తలవంచుకుని అన్నాడు, "నిన్ననే ఆయనతో నేను మాట్లాడాను. ఆయన ఒప్పుకోలేదు...."

"మరేం చెయ్యాలిరా."

"పోనీ నేను నా ఉద్యోగం వదిలేస్తాను... ఏమీ కాదు... నాకూ పెన్షన్ వస్తుంది... సర్దుకుందాం..."

సుధాకర్ మాట్లాడలేదు. తల్లివైపు అయిష్టంగా చూశాడు.

"ఎవరికైనా సరే రా. ఒకసారి వచ్చిన అవకాశం తర్వాత రాకపోవచ్చు. భర్త మంచాన పడ్డా, డబ్బు కోసం, నేను ఉద్యోగం చేయాలనుకున్నప్పుడు - పాతికేళ్లు లేని పిల్ల - మామగారికోసం, అత్తగారి సులువు కోసం తన ఉద్యోగాన్ని ఎందుకు త్యాగం చెయ్యాలి?"

సుధాకర్ మాట్లాడలేదు.

"నేను లీలతో మాట్లాడతాను... ఇంకా వారం టైమంది....నువెళ్లి పడుకో"

సుధాకర్ లేచి తన గదివైపు వెళ్లాడు. మహాలక్ష్మి కాసేపు కొడుకు ఖాళీ చేసిన చోటును

చూసింది. లేచి తన గదిలోకి వెళ్లింది... మంచంమీద ఉలుకూ పలుకూ లేకుండా పడిఉన్న భర్తనోసారి చూసింది. అక్కడ ఉన్న కుర్చీలో కూర్చుంది. చుట్టూ చిన్నగా వెలుతురు... అందులో తేలి ఆడుతున్న నిశ్శబ్దం... ఆ రెండూ కలిసి ఆమెతో దోబూచులాట మొదలు పెట్టడంతో ఆమె తన ఆలోచనల్లో తలదాచుకోవల్సి వచ్చింది.

సరిగ్గా అప్పుడే లీల నెమ్మదిగా తలుపు తోసుకుని ఆ గదిలోకి వచ్చింది. మహలక్ష్మి కోడల్ని చూసింది... "ఏం లీలా నిద్రపట్టలేదా?" అంది.

"మీరు నిద్రపోయారో లేదో చూద్దామనిపించింది అత్తయ్యా"

మహలక్ష్మి లేచి మంచంలో కూర్చుని తనకు చోటు చూపించింది.... లీల కూర్చుంది.

"సుధాకర్ నాకంతా చెప్పాడు. వాడి ఆలోచన తప్పు. వాడి మాటలకు బాధ పడకు సుమా... ఉన్న ఊళ్ళో ఉద్యోగం వచ్చింది. హాయి..."

"నిజమే అనుకోండి... కానీ..."

"ఓ మాట చెప్పనా లీలా... ఇంట్లో మీ మామ గారితో తోడుగా ఎవరూ ఉండరని బాధపడొద్దు... నాకూ ఉద్యోగం చేయాలని లేదు. రేపే రిజైన్ చేస్తున్నాను. మీ మామగారిని ఒదిలి ఆఫీసులో కూర్చున్నా నా మనసంతా ఇక్కడే ఉంటోందమ్మా... అక్కడ కూడా నా బాధ్యతల్ని సక్రమంగా నిర్వహించలేనని ఈ వారం రోజులుగా అనుభవంకి వచ్చింది."

"అదేం కాదు... మీరు మాతృప్తికోసం చెబుతున్నారు."

మహలక్ష్మి చిన్నగా నవ్వి అంది... "నేనీ నిర్ణయం తీసుకున్నది వేరే ఉద్దేశంతో కాదు లీలా. ఇంతకాలం నువ్వు నాతో పాటు ఓపిగ్గా ఆయనకు సేవలు చేశావు. ఇల్లూ చూసుకున్నావ్. ఆ విషయం నాకు తెలియంది కాదు. ఈ సమయంలో మీ మామగారికి దగ్గరగా ఉండడం నా ధర్మం. అదే ఆయనకు కూడా ఆనందాన్ని ఇస్తుంది.."

"పైగా ఇంట్లో కూర్చుని నేను చేసేది కూడా ఓ రకమైన ఉద్యోగమేనేమో లీలా... ఎందుకంటే అధికార దర్పంలేని, క్రింద ఉద్యోగస్తుల మీద దూంధాములు చేయని, మెమోలు, సస్పెన్షన్ల మాట ఎత్తని నా పై అధికారి ఈయనే! ఏమి అన్నా జవాబు చెప్పకుండా, పెట్టింది తిని ఊరుకునే ఇలాంటి రిటైరయిన మంచి ఆఫీసరు ఎక్కడ వెదికితే దొరుకుతారంటావ్? తన సంపాదనా అంతా మనచేతిలో పోసి, మన దయాధర్మాల మీద పూర్తిగా ఆధారపడ్డ ఈ మూగ జీవికి సేవ చేయడం ఏ ఉద్యోగానికి సాటిది అవుతుందంటావ్. అందుకే నేనీ నిర్ణయానికి వచ్చాను..." అలా మాట్లాడుతుంటే మహలక్ష్మి గొంతు జీరపోయింది...

"ఊరుకోండి అత్తయ్యా బాధపడొద్దు..."

"లేదు, బాధ పడనులే. నువ్వెళ్ళి పడుకో లీలా" అంది.

❖ ❖ ❖

ఓ రాత్రి వేళ గదిలో అలికిడి అయితే మహలక్ష్మి కళ్ళు తెరిచి చూసింది.

"నిద్రపోలేదురా?" అంది.

"పర్వాలేదమ్మా" అంటూ సుధాకర్ తల్లి పక్కన కూర్చున్నాడు.

"ఆఫీసుకు పోవల్సిన వాడివి, నిద్రలేకపోతే ఎలారా?"

"నాన్న మీద కల వచ్చింది. నిద్ర పట్టకే ఇటు వచ్చాను."

"ఏమిటోరా?"

"అమ్మా నువ్వు లీలను ఉద్యోగం చేయమన్నావుటగా. తెగ సంతోషపడింది... అన్నీ చెప్పింది."

"లీల, వెర్రిపిల్లరా"

సుధాకర్ చటుక్కున అన్నాడు. "అమ్మా, నేనో నిర్ణయానికి వచ్చాను" అని.

"ఏమిటిరా?"

"నేను, ముందు ఓ నెలపాటు శెలవు పెట్టదల్చుకున్నాను. జీతం రాకపోయినా సరే"

"వద్దురా. నేనే ఉద్యోగం వదిలి వేయాలనుకుంటున్నానురా. బెనిఫిట్స్ ఎక్కువ రానీ – తక్కువ రానీ... ఇంట్లో ఉండి మీ నాన్నను నేను చూసుకుంటాను.."

"కాదమ్మా, నే చెప్పేది విను. నాన్నని చూడ్డానికి ఓ మనిషిని కూడా పెడతాను. ఇంట్లో ఇద్దరం ఉంటాం. నువ్వు మాత్రం ఉద్యోగం మానవద్దమ్మా."

"డబ్బు గురించే కాదు కదురా... మీ నాన్నని ఎలాగూ ఎవరో ఒకరు దగ్గర ఉండి చూసుకోవాలి. ఆ పని నేను చేస్తే నాకు ఆనందంగా ఉంటుంది... కాదంటావా చెప్పు."

"ఇవన్నీ ఒట్టి చాదస్తాలమ్మా... నాన్న ఎప్పుడు రికవరీ అవుతారో, ఏమో... ఎంతకాలమైనా పట్టవచ్చు... అన్నీ నీకు తెలుసు. తెలుసుండీ వెర్రిగా ఉద్యోగం మానేస్తాననంటావేమిటి?"

అలా సుధాకర్ చాలాసేపు తల్లికి రకరకాలుగా హితవులు చెప్పాడు. మహలక్ష్మిగారు కూడా మాటలు తూలకుండా తనని తాను అదుపులో పెట్టుకుంటూనే కొడుకును ఒప్పించడానికి విశ్వప్రయత్నం చేసింది. అయినా అతను తల్లి మాటలకు చెవీ పెట్టలేదు, హృదయమూ పెట్టలేదు! పైగా ఆమె మీద చిన్నపాటి విసుగునూ, అసహనాన్ని ప్రదర్శించాడు. అంతా విన్న మహలక్ష్మి ఏమీ అనలేదు. నిద్రపోతున్న భర్తని చూసింది. తనలోకి తనూ చూసుకుంది.

అప్పుడు ఆ క్షణంలో ఆమెకు తను ఏకాకిని మాత్రమే కాదనీ అశక్తురాలననే నిజం కూడా తెలిసొచ్చింది!! దాంతో దుఃఖం ఆపుకోలేకపోయింది.

"కానివ్వరా... నా ఉద్యోగం, నా సంపాదనా నీకు నా కన్నా, మీ నాన్న కన్నా ఎక్కువని పరోక్షంగా చెప్పావు. చాలు. అలాగే.. నేను ఉద్యోగం మానను. చేస్తాను. రిటైరయ్యేదాకా చేస్తాను... సరేనా... వెళ్ళి పడుకో.. నాకు నిద్రవస్తోంది..." అంది, కళ్లు ఒత్తుకుంటూ!!

❖